క్లుప్తంగా

మణిపూర్ ఘటనపై అమలాపురంలో నేడు నిరసన

మండపేట: మణిపూర్‌లో మహిళలను వివస్త్రలు చేసి, అత్యాచారం చేసిన ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమలాపురంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు సంఘీభావం తెలిపేందుకు తరలి రావాలని కామన కోరారు.

బీమా తక్షణ సాయం అందజేత


లబ్ధిదారుకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: నేలటూరులో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన దొడ్డిపట్ల చిన్నమ్మ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకంలో రూ.లక్ష మంజూరైంది. అందులో భాగంగా తక్షణ సాయంగా రూ.10 వేల నగదును చిన్నమ్మ కుటుంబ సభ్యులకు సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యురాలు రుద్రాక్షుల వీరగౌరికుమారి, కార్యదర్శి రామకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ జేఎస్‌వీ లక్ష్మి చేతుల మీదుగా అందజేశారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

కె.గంగవరం: మండలంలో రెండు గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కె.గంగవరం, శేరిలంక గ్రామ సచివాలయాల వద్ద ఈ క్యాంపు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. లబ్ధిదారులు ఎటువంటి ధ్రువపత్రాలు కావాలన్నా క్యాంపుల వద్ద దరఖాస్తు అందిస్తే ఒక్క రోజులోనే ఉచితంగా పత్రాలు అందిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నారుమడుల్లో నీరు తొలగించండి

కాజులూరు: చెదురు మదురు వర్షాల కారణంగా నారుమడులు, వెదచల్లిన పొలాల్లో నిలిచిపోయిన అదనపు నీటిని రైతులు వెంటనే తొలగించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం దుగ్గుదుర్రులో ఆయన రైతులతో మాట్లాడుతూ విత్తనాలు చల్లిన తర్వాత పొలంలో నీరు తీసేయాలన్నారు. నేల తడిపొడి పదునులోనే మొలకెత్తిన గింజ వేరునాటి అంకురం ఏర్పడుతుందన్నారు. ఈ పరిస్థితులలో పొలంలో నిండుగా నీరు ఉంటే గింజ మొలకెత్తకుండా చనిపోతుందన్నారు. కాలువల ద్వారా నీరు బయటకు వెళ్లకపోతే నీటి గుల్ల, ఆయిల్ ఇంజిన్ సహాయంతోనైనా పొలంలో నీరు తొలగించాలన్నారు.

ఘనంగా త్యాగరాజ జయంతి


కేశవరంలో త్యాగరాజ జయంతి ఉత్సవ ర్యాలీలో కళాకారులు

మండపేట: ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజ స్వామి ఉత్సవాలను మంగళవారం మండలంలోని కేశవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకుడు కాజులూరి చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సంఘం సభ్యులు హాజరయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాయిద్య కళాకారులు ప్రదర్శించిన డోలు సన్నాయి, తాళమేళాల ప్రదర్శన అలరించింది. త్యాగరాజ చిత్ర పటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సీనియర్ నాదస్వర కచేరి, వాయిద్య కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వెన్నేటి నాగేశ్వరరావు, నాయకులు పావులూరి నాగ పుత్రయ్య, వెల్ల సూరిబాబు, సత్యవాడ అన్నవరం, కొండపల్లి కృష్ణ, సత్యవాడ సూరిబాబు, దంగేటి దుర్గారావు, కుందూరు గణేష్, వెల్ల సత్యనారాయణ, వాయిద్య కళాకారులు పాల్గొన్నారు.

విశ్వ మానవత సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేటలో రాయవరం మండలం లొల్ల గ్రామానికి చెందిన విశ్వ మానవత సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత హోమియో వైద్య శిబిరం, యోగా అవగాహనా శిబిరం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఆరోగ్య జీవన విధానం, నిత్య యోగాతో పొందే ప్రయోజనాలను వివరించారు. అనంతరం డాక్టర్ సత్యనారాయణ, సుబ్బరాజులు సుమారు 70 మంది రోగులకు పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు.

అభివృద్ధికి రహదారులు

- రూ.20 కోట్లతో పనులు
- మూడు రహదారులకు మోక్షం
- పలుగ్రామాల ప్రజలకు మార్గం సుగమం


విస్తరణతో అభివృద్ధి చెందిన వెలంపాలెం-పాణింగపల్లి రోడ్డు

రామచంద్రపురం: రెండు మండలాలను కలుపుతూ ఉండే ప్రధాన రహదారులు.. సుమారుగా 5 వేల ఎకరాల పంటను దరిచేర్చే రోడ్లు.. కానీ చిరకాలంగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ రహదారి అభివృద్ధి కావటంతో సుమారుగా 25 గ్రామాల ప్రజలు, రైతులు సుఖపడ్డారు.

వెలంపాలెం-పాణింగపల్లి..

రామచంద్రపురం మండలం వెలంపాలెం పంచాయతీ పరిధిలోని గున్నయ్యతూము వద్ద నుంచి నెలపర్తిపాడు మీదుగా కె.గంగవరం మండలం పాణింగపల్లి వరకు ప్రధాన రహదారి ఉంది. ఈ రోడ్డు రెండు మండలాలను అనుసంధానం చేస్తు సుమారుగా 20 ఏళ్ల కిత్రం ఏర్పాటయింది. ఈ రహదారిని అనుకుని సుమారుగా 2 వేల ఎకరాలకు పైబడి రెండు మండలాల్లోను రైతులు పంట భూమి ఉంది. రెండు పంటలు కూడా వరి పండిస్తుంటారు. ఎటు చూసిన కనుచూపు మేర వరి చేలు ఈ రహదారికి ఇరువైపులా ఉంటాయి. కె.గంగవరం మండలం నుంచి ద్రాక్షారామ రామచంద్రపురం రావాలంటే ఇదే ప్రధాన రహదారి సుమారుగా 8 కిలోమీటర్లు ఉంటుంది.

శివల- యర్రపోతవరం

కె.గంగవరం మండలంలోని యానాం ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా పలు పంచాయతీ ప్రజలకు మెయిన్‌రోడ్డుకు వచ్చే రోడ్డు శివల-యర్రపోవతరం జంక్షన్ రోడ్డు ఈ రోడ్డు దశాబ్దకాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. సుమారుగా 6 కిలోమీటర్ల మేర ప్రతి వర్షాకాంలోనూ నరకంగానే ఉండేది. ప్రస్తుతం ఈ రహదారి అభివృద్ధిని నిధులు మంజూరు కావటంతో అభివృద్ధికి నోచుకుంది.

దంగేరు-కె.గంగవరం

కె.గంగవరం మండలంలోని ప్రధాన రహదారి కె.గంగవరం దంగేరు రోడ్డు, మండలంలోని శివారు పంచాయతీలకు చేరాలన్నా, మండల కేంద్రానికి వెళ్లేందుకు ఈ రోడ్డు ప్రధానంగా ఉంటుంది. సుమారుగా 5 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డును ఇటీవల నూతంగా అభివృద్ధి చేశారు.

ఎన్నో కష్టాలు.. ఆక్రమణలు..

గతంలో ఈ రహదారి మీదుగా వెళ్లాలంటే.. ఎన్నో కష్టాలు పాలయ్యేవారు. గున్నయ్యతూము ప్రాంతంలో ఈ రోడ్డు గతంలో ఆక్రమణలకు గురయింది. వెలంపాలెం దాటిన తరువాత ఇరుకురోడ్డుతో దమ్ముట్రాక్టర్లు కూడా తప్పించుకునేందుకు వీలు లేకుండా ఉండేది. దీంతో ప్రతిసారి పంట కాలంలో ట్రాక్టర్లు, లారీలతో తీవ్రమైన ఆటంకం ఏర్పడుతూ ఉండేది. దీనికి అధిగమించేందుకు ఈ రోడ్డును అభివృద్ధి చేశారు. వెలపాలెం గున్నయ్యతూము వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను ప్రభుత్వం తొలగించింది. వెలంపాలెం నుంచి పాణింగపల్లి టేకి డ్రైన్ వరకు రోడ్డును విస్తరిస్తూ అభివృద్ధి చేశారు.

మూడు రహదారులకు మోక్షం

ఈ మూడు ప్రధాన రహదారులను మూడు ప్యాకేజీలుగా విభజించి మొత్తం రూ.20 కోట్లతో సమగ్ర అభివృద్ధి చేశారు. మొత్తం 18 కిలోమీటర్ల మేర ఈ రహదారులను నూతనంగా వెడల్పు చేసి అభివృద్ధి చేయటంతో ప్రజలు, రైతుల కష్టాలు గట్టెక్కాయి.

రైతులకు సులువుగా ఉంది



ఏటా పంట మాసూళ్ల సమయంలో రైతులు ఈ రహదారుల్లో ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చేది. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయిన తరువాత ట్రాక్టర్లు, లారీలపై పంటను తరలించేందుకు సులువుగా మారి కష్టాలు తీరాయి. రోడ్లు వెడల్పు చేయడంతో ట్రాఫిక్ కష్టాలకు మోక్షం కలిగింది.

– కొప్పిశెట్టి వెంకటరమణ, సర్పంచ్, దంగేరు

రెండు మండలాలు అనుసంధానం



వెలంపాలెం-పాణింగపల్లి రోడ్డు విస్తరణతో దశాబ్దకాలంగా ఉన్న సమస్య పరిష్కారమయింది. ముఖ్యంగా కె.గంగవరం మండలం నుంచి నియోజకవర్గ కేంద్రం రామచంద్రపురం వచ్చేందుకు దగ్గర దారి కావటంతో ప్రజలు ఆనందం వ్యకం చేస్తున్నారు.

– టేకుమూడి సత్యనారాయణ, వెలంపాలెం

ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర వాహనం అందజేత


ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర వాహనాన్ని లబ్ధిదారుడు లోవరాజు దంపతులకు అందజేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: చేపల వినియోగం-వ్యాపారం పెంచే విధంగా పీఎంఎంఎస్‌వై పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్ర పథకంలో మంజూరైన వాహనాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మంగళవారం లబ్ధిదారుడికి అందజేశారు. మండలంలోని కాపవరం గ్రామానికి చెందిన జనిపెల్ల లోవరాజుకు రూ.7,97,879 సబ్సిడీతో రూ.13,29,798 విలువైన వాహనం మంజూరయింది. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీలు రెడ్నం సతీష్, నున్న సత్యవతి, తుమ్మూరి సుబ్బలక్ష్మి, నురుకుర్తి శ్రీరామకృష్ణ, సర్పంచ్‌లు పిల్లి అచల రాజశ్రీ, కొత్తపల్లి అరుణ, ఎంపీడీఓ ఎస్. షెలత్‌రాజు, మత్స్య శాఖ జిల్లా అధికారి షేక్ లాల్ మహ్మద్, ఎఫ్‌డీఓ విళ్ల రమణారావు, వీఎఫ్ఏ కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి


మండల పరిషత్ సమావేశంలో ఏపీఓకు సూచనలు చేస్తున్న మంత్రి వేణు

మండల పరిషత్ సమావేశంలో మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సాధారణ సమావేశం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వివిధ శాఖల అధికారులతో మండల సమీక్ష నిర్వహించారు.

ఏపీఓతో మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటం కారణంగా ఉపాధి కూలీలకు ఆయా గ్రామాల్లో రోడ్లపై చెత్త లేకుండా, అపరిశుభ్ర వాతావరణం లేకుండా ఉండే విధంగా పనులు కల్పించాలని సూచించారు. గ్రామాల్లో తమను ఎన్నుకున్న ప్రజల క్షేమం కోసం ప్రజాప్రతినిధులు పరిశుభ్రమైన వాతవరణం కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-కేవేసీ చేయించుకునేలా తద్వారా వారికి ప్రభుత్వం నుంచి పూర్తి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వెల్ల ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు ఆర్‌బీకేల్లో డీఏపీ లేదని మంత్రి వేణు దృష్టికి తీసుకు రాగా మార్క్‌ఫెడ్ వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు సూచించారు. ద్రాక్షారామ, హసన్‌బాద జగనన్న కాలనీల్లో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ద్రాక్షారామ ప్రధాన రహదారి అధ్వానంగా ఉందని తోటపేట, వెంకటాయపాలెం ఎంపీటీసీలు మంత్రి దృష్టికి తీసుకుని రాగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయని తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నిడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

నిండుశోకంతో మొహర్రం సంతాప దినం


ద్రాక్షారామలో నిప్పుల గుండంపై నడుస్తున్న భక్తులు


ద్రాక్షారామలో గుర్రాలపై పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా 7 వ రోజు మంగళవారం ద్రాక్షారామలోని ముస్లింలు నిండు శోకంతో నిర్వహించుకున్నారు. 6 వ రోజైన సోమవారం రాత్రి ఇమామ్ హుస్సేన్ పంజాలో నిప్పుల గుండం తొక్కారు. మంగళవారం ఇస్లాం వ్యవస్థాపకుడు మహమ్మద్ ప్రవక్త మనుమడు ఇమామ్ హుస్సేన్ పరివారానికి ప్రార్థనలు, మాతం చేశారు. అనంతరం బీబీ సకీనా పంజాలో ఉత్తరప్రదేశ్ నుంచి విచ్చేసిన మతగురువు మౌలానా మొహమ్మద్ షంసీ మజిలీస్ చదవి వినిపించారు. అనంతరం బీబీ సకీనా పంజా, షహజాదే ఖాసిం పంజా, సక్షా పంజాల నుంచి పీర్లను గుర్రాలపై ఊరేగింపు నిర్వహించారు. ఆగావారి వీధిలో ఖాసిం ఇతివృత్తాంతాన్ని ఆలపిస్తూ బోరున విలపించారు. ఖాసిం వేషధారణను భక్తులు తిలకించారు. ద్రాక్షారామ, పరిసర గ్రామాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంజుమన్ సంఘాలు, ధర్మకర్తలు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ప్రమాదకరంగా రహదారి


ప్రమాదకరంగా మారిన పేకేరు-దంగేరు రహదారి

కె.గంగవరం: తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారుల్లో చలనం లేదు. రోడ్డు పక్కన కాలువతో పాటు ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద గుబురుగా ఉన్న పొదలు వాహనదారులపై మృత్యు మార్గాలుగా మారాయి. కె.గంగవరం నుంచి దంగేరు, కుడుపూరు మీదుగా పేకేరు వరకు రహదారి ఉంది. దంగేరు నుంచి పేకేరు వరకు ఉన్న రహదారి టేకి డ్రైన్‌ను ఆనుకుని ఉంటుంది. ఆరు నెలల క్రితం ఈ రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులు అభివృద్ధి చేశారు. ఇదిలా ఉండగా దంగేరు నుంచి కుడుపూరు వరకు ఉన్న రహదారిలో సావరం దాటిన తరువాత మలుపు చాలా ప్రమాదకరంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దంగేరు నుంచి కుడుపూరు మీదుగా పేకేరు వరకు సుమారు 7 కిలోమీటర్లు మేర టేకిడ్రైన్‌ను అనుకుని ఆర్‌అండ్‌బీ రహదారి ఉంది. నిత్యం వందలాది వాహనాలు ఇదే రోడ్డు గుండా వెళుతుంటాయి. దీంతో పాటుగా పేకేరు, కుడుపూరు, భట్లపాలిక తదితర ప్రాంతాల నుంచి పాఠశాలలు, కళాశాలలు బస్సులు కూడా తిరుగుతుంటాయి. ఈ రోడ్డు ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా నివారణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్డీఓ పర్యటన

అయినవిల్లి: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి మంగళవారం పర్యటించారు. ఆర్డీఓ ముక్కంటి మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలైన వీరవల్లిపాలెం, అయినవిల్లి లంక, పొట్టిలంకల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్ చెందిన మూడు బృందాల వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. 42 మంది బృంద సభ్యులు ఉన్నాయన్నారు. వరదకు ముంపుకు గురైన ప్రాంతాల్లో ఈ బృందాలు ఎప్పటికప్పుడు పర్యటిస్తూ సహాయక చర్యలు చేపడతాయన్నారు. వరద పరిస్థితులపై అధికారులను ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. ఆయన వెంట డీటీ తహసీల్దార్ అశోక్ తదితరులు ఉన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజనల్‌గా సంభవించే డెంగీ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించాలని జిల్లా మలేరియా యూనిట్ అధికారి సత్యనారాయణ కోరారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పెదపళ్ల పీహెచ్‌సీలో వైద్యాధికారి పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో డెంగీ నివారణ-వైద్యారోగ్య సిబ్బంది పాత్రపై అవగాహన సదస్సు జరిగింది. డెంగీ నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలపై వైద్యారోగ్య సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు వీవీ రమణారావు, పి.ఉమ, ల్యాబ్ టెక్నీషియన్ పీఆర్ రమేష్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర శాలివాహనులను ఆదుకున్నది వైఎస్సారే

అంబాజీపేట: కుమ్మర శాలివాహనులకు రెండు సార్లు ఎమ్మెల్సీ, ఒకసారి ఎమ్మెల్యే ఇచ్చి అన్ని విధాలా అండగా ఉన్నది దివంగత డాక్టర్ వైఎస్సారేనని అని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కుమ్మరి శాలివాహన సంఘ మాజీ అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం అన్నారు. మాచవరంలో కుమ్మర, శాలివాహన సంఘ భవనంలో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా సమావేశం మంగళవారం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో కుమ్మరి శాలివాహనులకు ఫెడరేషన్ ఏర్పాటు చేశారని ఆయన సేవలు ఇప్పటికీ మరువలేమన్నారు. కుమ్మరి శాలివాహనులకు ఏటా రూ.పదివేలు ఇచ్చి తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అలాగే పలు సమస్యలను ప్రస్తావించారు. త్వరలో 22 మండలాల్లో సంఘాన్ని బలోపేతం చేయడం, నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం తదితర అంశాలపై తీర్మానం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


పసలపూడిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు


అద్దంకివారిలంకలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ప్రజాప్రతినిధులు


మంజేరులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్ తదితరులు

రాయవరం: సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులకు న్యాయం చేయడానికి సురక్ష కార్యక్రమాన్ని అమలు చేశారని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని పసలపూడిలో సర్పంచ్ కడలి పద్మావతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం అవుతున్నాయన్నారు. అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు సేవలందిస్తున్న వాలంటీర్లను వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో దుశ్శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ కర్రి విజేత, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, కర్రి సముద్రారెడ్డి, మల్లిడి వెంకటరామారెడ్డి, పోతంశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

22,500 సర్టిఫికెట్ల పంపిణీ

మండలంలోని 19 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించినట్టు ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని 23,961 గృహాలకు 22,863 టోకెన్లను వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల నిమిత్తం జారీ చేయగా, 22,500 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్టు వివరించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మండలంలోని వివిధ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా దరఖాస్తుదారులకు వారు కోరుకున్న ధ్రువపత్రాలు జారీ చేసినట్లు తెలిపారు.

లంక గ్రామాల అభివృద్ధికి విశేష కృషి

కపిలేశ్వరపురం: లంక గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్ అన్నారు. అద్దంకివారిలంకలో మంగళవారం సర్పంచ్ నాతి గవరయ్య అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, వీఆర్వో స్వామినాయుడు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 3,080 మందికి సేవలందించామని సచివాలయ ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సిద్ధాంతుల దొరబాబు, కొండమూరి నాని, చిటికెన గంగాభవాని, మాజీ సర్పంచ్ గొల్లకోటి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. మంగళవారం మంజేరు గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, మండల తహసీల్దార్ సాయిసత్యనారాయణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సర్పంచ్ గుంటూరి అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తన పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరాలన్నదే సీఎం జగనన్న ఆశయమని దానికనుగుణంగా కుల, మత, పార్టీల భేదం లేకుండా అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. ఏ కారణం చేతనైనా ఇంకనూ పథకాలు అందకుండా మిగిలిపోయిన లబ్ధిదారులు ఉంటే వారిని గుర్తించి తగిన న్యాయం చేయాలన్న లక్ష్యంతోనే గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వలంటీర్ల ద్వారా అధికారులే లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఐ.రత్నరాజు, ఈఓపీఆర్డి సీహెచ్ ఇందిరాదేవి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చే ఏకైక ప్రభుత్వం


వెల్లలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: క్షేత్రస్థాయిలో ప్రజావసరాలను గుర్తించి వారి ఇళ్లకే వెళ్లి వారి అవసరాలను తీర్చే ఏకైక ప్రభుత్వం ఈ దేశంలో ఏదైనా ఉందంటే అది మన రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని వెల్లలోని రెండు గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్షలో ఆయన పాల్గొన్నారు. వెల్లలో ఏళ్ల పాటు గ్రామ ప్రజలను పట్టి పీడించిన సొంత ఇంటి సమస్యను పరిష్కరించి అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నాలుగేళ్లలో అర్హులైన లబ్ధిదారులకు జగనన్న నవరత్నాల పథకాల ద్వారా రూ.23 కోట్లు పైగా లబ్ధి చేకూరినట్లు తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. అనంతరం జగనన్న సురక్ష పథకం ద్వారా మంజూరైన ధ్రువీకరణ పత్రాలను సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఉప సర్పంచ్ అన్యం శాంతకుమారి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, ఎంపీపీ అంబటి భవాని, పీఏసీఎస్ చైర్మన్‌లు పిల్లి బాలసుబ్రహ్మణ్యం, గిసాల శివ, సర్పంచ్ కట్టా గోవిందు, ఎంపీటీసీ నురుకుర్తి శ్రీరామకృష్ణ తదితరులతో కలసి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పంతగడ విజయప్రసాద్, తోట వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.